ప్రజాశక్తి

శనివారం 11 ఫిబ్రవరి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఆవును చంపిన పెద్దపులి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని పెద్దబొమ్మలాపురం ఫారెస్ట్ బీట్ పరిధిలో ఈ నెల ఆరున మేతకు వెళ్లిన ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. దాడి అనంతరం ఆవు యజమాని కేతావత్ హనుమంతునాయక్ ఫారెస్ట్ అధికారులకు తెలియజేయడంతో దాడి జరిగిన ప్రాంతానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పాదముద్రలను గుర్తించి పెద్దపులి దాడి చేసినట్లు ధ్రువీకరించారు.

ఎన్నికల కోడ్‌తో 'స్పందన' నిలిపివేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉపాధ్యాయ, పట్టభద్రుల కోటాలో ఎంఎల్‌సీ ఎన్నికల దష్ట్యా జిల్లాలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున స్పందన కార్యక్రమాలను నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు స్పందన కార్యక్రమాలు ఉండవని పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు ఈ మార్పును గమనించాలని ఆయన సూచించారు.

శంకుస్థాపన చేసింది నేనే.. 'వెలిగొండ'ను ప్రారంభించేది నేనే..

- టిడిపి అధినేత చంద్రబాబునాయుడు
- మాజీ సిఎంను కలిసిన పెద్దారవీడు మండల రైతులు

2లో



మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

కళాక్షేత్రం స్థలం కబ్జా

- షెడ్లు వేసుకొని వ్యాపారం చేసుకుంటున్న ప్రయివేటు వ్యక్తులు
- గద్దలగుంటలో 'ఆడోళ్ల బడి' అడ్రస్ గల్లంతు
- స్థలం మీద హక్కు ఉందనే పేరుతో ఆక్రమించిన ప్రయివేటు వ్యక్తి
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు



కబ్జాకు గురైన కళాక్షేత్రం స్థలం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలోని ఆర్టీసీ డిపో పక్కన ఊరచెరువులో ఉన్న స్థలంలో 2005లో మున్సిపల్ కళాక్షేత్రం నిర్మించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. సుమారు రెండెకరాలున్న ఈ స్థలం తాజాగా కబ్జాకు గురైంది. రెండెకరాల్లో సగభాగం ఓ ప్రైవేటు వ్యక్తి ఆక్రమించాడు. అందులో షెడ్లు వేసుకొని అద్దెలు వసూలు చేసుకుంటున్నాడు. ఆక్రమణలు బయటకు కనిపించకుండా చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేశాడు. నిత్యం అక్కడే తిరిగే మున్సిపల్ అధికారులకు ఈ స్థలాన్ని రక్షించాలన్న ఆలోచన కూడా రాకపోవడం విశేషం.

ఒంగోలు గద్దలగుంటలోని మర్రిచెట్టు బజారులో ఉన్న బడిని అప్పట్లో ఆడోళ్లబడి అని పిలిచేవారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడ పాఠశాల ఉండేది. వేలాదిమంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకున్నారు. అందులోనే ఎన్నికల పోలింగ్ బూత్ కూడా నడిచేది. తాజాగా ఈ బడి ఆక్రమణకు గురైంది. ఓ ప్రయివేటు వ్యక్తి దీన్ని స్వాధీనం చేసుకున్నారు. తనకు భూమి మీద హక్కు ఉందని చెబుతూ పాత స్కూల్ భవనానికి రీమోడలింగ్ పనులు చేస్తున్నాడు. ఆపైన ఓ ఇంటి నిర్మాణం కూడా చేపట్టాడు. నిన్నమొన్నటి దాకా స్కూల్ భవనంగా ఉన్న ప్రాంతంలో ఇప్పుడు ప్రయివేటు వ్యక్తి రీమోడలింగ్ పనులు చేస్తుండటంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

నగరంలో ఆక్రమణలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ స్థలాలను, మున్సిపల్ స్థలాలను లక్ష్యంగా చేసుకొని కొంత మంది ప్రయివేటు వ్యక్తులు ▶ 2లో



'ఆడోళ్ల బడి' భవనం

అన్ని వర్గాల నుంచి
విశేష ఆదరణ



- జగన్ పాదయాత్రలో ఇచ్చిన ఏ హామీ అమలు కాలేదు
- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్ని రకాలుగా అన్యాయం
- 'ప్రజాశక్తి'తో పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'అక్టోబర్ రెండో తేదీ నుంచి ప్రచారం మొదలుపెట్టా.. ఉమ్మడి మూడు జిల్లాల్లో ఇప్పటికే 90 మండలాల్లో పర్యటించా.. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరిగా.. ఎక్కడకు వెళ్లినా ఉద్యోగుల నుంచి అనేక సమస్యలు.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పాదయాత్రలో జగన్ ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని చెబుతున్నారు..' అని పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినప్పటి నుంచి ప్రతిరోజూ వివిధ వర్గాలను కలుస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ ఉందని, అందుకు పిడిఎఫ్ కూటమి ఆయా వర్గాలకు సంబంధించిన సమస్యలపై మండలిలోనూ, బయటా చేసిన పోరాటాలు.. సాధించిన విజయాలే కారణమన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్ ఉద్యోగులు, కాంటాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ సిఎం అయ్యాక అమలు కాలేదన్నారు. వీటిని ఎక్కడకు వెళ్లినా ప్రస్తావిస్తున్నారని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే వేలాది మంది ఉపాధ్యాయులకు ఇపిఎఫ్, ఇహెచ్‌ఎస్‌లతో పాటు రూ.1000 కోట్లతో నిధి ఏర్పాటు చేస్తే కరోనా వంటి విపత్తుల్లో సాయం చేయడానికి అవకాశం ఉంటుందని మండలిలో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం ప్రస్తావించారని గుర్తు చేశారు. ప్రతి ప్రైవేటు ఉపాధ్యాయుడికీ గుర్తింపు కార్డు ఇవ్వాలని కూడా చెప్పామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదన్నారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్లినపుడు ఈ సమస్యలను తానూ గుర్తు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు కూడా వీటినే ప్రస్తావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కస్తూరిబా బాలిక విద్యాలయాల్లో పనిచేసే వాళ్లంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్కింగ్ ఉద్యోగులేనన్నారు. వీరికి వేతనాలు చాలా తక్కువగా ఇస్తున్నారన్నారు. ప్రకాశం జిల్లాలోనే 37 పాఠశాలలున్నాయన్నారు. ఈ పాఠశాలల్లో పనిచేసేవాళ్లంతా చాలీచాలని వేతనాలతోనే కాలం గడుపుతున్నారని పేర్కొన్నారు. ఇంకా గిరిజన, సాంఘీక సంక్షేమ శాఖ, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేసే వారందరినీ రెగ్యులర్ చేయాలనే డిమాండ్ కూడా నెరవేరలేదన్నారు. జగన్ ఆనాడు ప్రతిపక్షనేతగా అందరినీ రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చలేదని చెప్పారు. సచివాలయ ఉద్యోగులనూ కలుస్తున్నామన్నారు. వీరిని కూడా అర్హత పరీక్ష పేరుతో రెగ్యులర్ చేయడం లేదన్నారు. వేతనాలు తగ్గించేందుకే ఇలాంటి షరతులు పెడుతున్నారని చెప్పారు. పిఎఫ్ వస్తే మేలు జరుగుతుందన్నారు. వీరికి కూడా డిఏ బకాయిలు పెట్టారని చెప్పారు. ఇంకా తహశీల్దార్ కార్యాలయాలు, ఎంపిడిఓ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లోనూ, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లోనూ చాలా పోస్టులు ఖాళీగా పెట్టారన్నారు. వీరిని భర్తీ చేస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పెట్టినా వారిని కూడా రెగ్యులర్ చేయడం లేదన్నారు. ఇవన్నీ ▶ 2లో

రాష్ట్ర రాజధాని అంశంపై
గోడపై పిల్లిలా కేంద్రం

- రాజధానికి ఇవ్వాల్సిన నిధులు ఎగ్గొట్టేందుకే బిజెపి కుట్ర
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు రమాదేవి



మాట్లాడుతున్న రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

అమరావతి రాజధానికి కట్టుబడి ఉన్నామని ఒక పక్క చెబుతూనే.. రాష్ట్రంలో వైసిపి, టిడిపిల మధ్య చిచ్చు పెడుతూ రాజధాని నిర్మాణానికి ఇవ్వాల్సిన నిధులు ఎగ్గొట్టేందుకు బిజెపి గోడ మీద పిల్లి వాటంగా వ్యవహరిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. శుక్రవారం బాపట్లలోని పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సిపిఎం జిల్లా కమిటీ విస్తత సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీల మధ్య తగాదాలు పెడుతున్న కేంద్రం రాజధాని నిర్మాణానికి నిధులు ఎగ్గొట్టేందుకే కుట్ర పన్నుతోందన్నారు. నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు రక్షణ కరువైంది..

కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు సరైన రక్షణ చర్యలు లేవని, కార్మికుల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెద్దాపురం మండలంలో చమురు ట్యాంకర్‌లో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మతి చెందడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధమైన ప్రమాదాలు తిరిగి పునరావృతం కాకుండా పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. అదానీకి రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ పేరిట నిబంధనలు లేకుండా విలువైన భూములను అప్పజెప్పడంపై రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులను ఒత్తిడి చేయడం నిలిపేసి.. గృహ నిర్మాణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం రైతుకు మొండి చెయ్యి చూపుతోందని విమర్శించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి తక్షణమే డబ్బులు చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు టి.కష్ణమోహన్, ఎన్.బాబూరావు, సిహెచ్. మజుందార్, వినోద్ పాల్గొన్నారు.

జియో ప్రతినిధులపై పోలీసులకు ఫిర్యాదు చేయండి

ఒఎంసి అధికారులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ధనగరంలో ఇష్టారీతిన రోడ్లు తవ్వుతున్న జియో కంపెనీ ప్రతినిధులపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఇంజినీరింగ్ విభాగం సిబ్బందిని కమిషనర్ ఎం. వెంకటేశ్వరావు ఆదేశించారు. నగరంలోని 36వ డివిజన్ పరిధిలోని అయ్యప్పసామి గుడి, నిర్మల్‌నగర్ ప్రాంతాలలో శుక్రవారం కమిషనర్ పర్యటించారు. జియో కంపెనీ 5జి సర్వీసు కేబుల్స్ వేసేందుకు రోడ్లు ఇష్టారీతిన తవ్వి ఉండటాన్ని కమిషనర్ ఈసందర్భంగా గమనించారు. వెంటనే సంబంధిత ప్రతినిధులను ఆప్రాంతానికి పిలించారు. అనుమతులకు విరుద్ధగా ఎందుకు రోడ్లు తవ్వుతున్నారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు గుంతలు తవ్వి పని అయి



గుంతలను పరిశీలిస్తున్న కమిషనర్

పోయిన తరువాత, వాటిని పూడ్చి మూడో గుంత తవ్వాలని నిబంధనల్లో ఉందని తెలిపారు. జియో కంపెనీ ప్రతినిధులు ఎక్కువ గుంతలు తవ్వుతూ వాటిని పూడ్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని మున్సిపల్ ఇంజినీర్‌కు సూచించారు. తక్షణమే తవ్విన గుంతలన్ని పూడ్చాలని జియో ప్రతినిధులను ఆదేశించారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ ఇంజినీర్ కె.మాల్యాద్రి, డిఇఇ గణపతి, ఎఇ చంద్రశేఖర్, 36వ డివిజన్ కార్పొరేటర్ ఢాకా సుజాత, వైసిపి నాయకుడు ఢాకా హనుమారెడ్డి ఉన్నారు.

యువకుడు మృతి

ప్రజాశక్తి - పిసిపల్లి

టవేరా వాహనానికి కర్రల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మారెళ్ల గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో దివాకరపల్లి గ్రామానికి చీమలదిన్నె వెంకటేశ్వర్లు (34) మృతిచెందాడు. మృతుడు పొన్నలూరు నుంచి దివాకరపల్లి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ ఎ. నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కళాక్షేత్రం స్థలం కబ్జా

(మొదటిపేజీ తరువాయి)

కబ్జాలకు పాల్పడుతున్నారు. ఆనక ఏదో ఒక నకిలీ పట్టా సృష్టించి స్థలం మీద హక్కులున్నాయంటూ న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇక ఊరచెరువులోని కళాక్షేత్రం విషయానికి వస్తే అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి దానికి శంకుస్థాపన చేసిన తరువాత దానికి నిధులు కేటాయించి అక్కడ కళాక్షేత్రం కట్టడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించారు. కాలక్రమంలో చాలా మంది ఇందులో నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించుకోవాలని చూశారు. అయితే అవి నకిలీ పట్టాలని అధికారులు నిర్ధారించుకొని ఆక్రమణలు తొలగించారు. ఈ ఆక్రమణల తతంగం గతంలో రెండు, మూడు ధపాలుగా జరిగింది. అధికారులు అప్పట్లో అడ్డుకున్నారు. అయితే ఇప్పుడు ఓ వ్యక్తి ఏకంగా కళాక్షేత్రం స్థలం చుట్టూ రేకులతో ఫెన్సింగ్ వేసి లోపల సిమెంటు రేకులతో షెడ్లు వేసి అద్దెలకిచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. పొద్దున లేస్తే ఊరచెరువు చుట్టూ తిరిగే ఉన్నతాధికారులు దీని మీద ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆర్టీసి డిపో పక్కన కోట్ల రూపాలయ విలువైన కార్పొరేషన్ స్థలం కబ్జాకు గురైతే కార్పొరేషన్ పాలకవర్గానికి, అధికారులకు కనీసం చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమని ఆ ప్రాంత ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈపాటికే వందల కోట్ల విలువైన మున్సిపల్ ఆస్తులు ఊరచెరువులో ఆక్రమణలకు గురయ్యాయి. కనీసం కళాక్షేత్రం స్థలాన్ని కాపాడాలని కళాకారులు కోరుతున్నారు.

ఆడోళ్ల బడి విషయం పరిశీలిస్తే.. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాల నడిచింది. ఇటీవల వైఎస్ జగన్ సర్కార్ తెచ్చిన నూతన విద్యావిధానం కారణంగా పాఠశాలల విలీనం పేరుతో అక్కడ చదువుకునే విద్యార్థులను వేరే స్కూల్‌కు తరలించారు. అప్పటి నుంచి స్కూల్ భవనం ఖాళీగా ఉంది. ఇదే అదునుగా చేసుకొని ఓ ప్రయివేటు వ్యక్తి దాన్ని కబ్జా చేశాడు. ఇదేమని చుట్టుపక్కల వాళ్లు ప్రశ్నిస్తే స్కూల్ భవనానికి ఇచ్చిన స్థలం తమ పూర్వీకులదని, అప్పట్లో స్కూల్‌కు స్థలం ఇచ్చామని, ఇప్పుడు అక్కడ స్కూల్ నడవడం లేదు కాబట్టి తమ పూర్వీకుల స్థలాన్ని తాము తీసుకున్నామని ఆ వ్యక్తి చెబుతున్నట్లు సమాచారం. స్కూల్ భవనం ఉన్న ప్రాంతం మీద తనకు హక్కులు ఉన్నట్లు తన వద్ద ఆధారాలు ఉన్నట్లు ఆ వ్యక్తి చెబుతున్నారు. ఆక్రమించిన వ్యక్తి ఇక్కడ దశాబ్ధాల కిందట ప్రభుత్వ నిధులతో నిర్మించిన స్కూల్ భవనాన్ని అలాగే ఉంచి.. దాన్ని రీమోడలింగ్ చేసుకొని, ఆపైన అదనపు గదులు నిర్మించుకొని తన ఆధీనంలోకి తీసుకున్నాడు. అసలు ఈ స్కూల్ పూర్వాపరాలు, ఆ స్థలం ఎవరి పరిధిలో ఉంది.దానిపై ఎవరికి హక్కు ఉందనే విషయాలను అధికారులు నిగ్గుతేల్చాలని గద్దలగుంట ప్రాంత నివాసితులు కోరుతున్నారు. ఇక్కడ స్కూల్ కొంతకాలం మున్సిపల్ ఆధీనంలో, మరికొంతకాలం మండల విద్యాశాఖ ఆధీనంలో నడిచింది. దీంతో ఆ స్కూల్ బిల్డింగ్, స్కూల్ బిల్డింగ్ స్థలం మీద హక్కు ఏ శాఖ పరిధిలో ఉన్నాయో తేల్చాలనేది స్థానికుల డిమాండ్. ఇదిలా ఉంటే ఈ కబ్జాకు గురైన స్కూల్ బిల్డింగ్ స్థానిక కార్పొరేటర్ ఇంటికి రెండు అడుగుల దూరంలో, నగర రెండో డిప్యూటీ మేయర్ ఇంటికి ఆరడుగుల దూరంలో ఉండటం ఆ ప్రాంతంలో చర్చనీయాశంగా మారింది. కనీసం అక్కడే నివాసం ఉంటున్న ప్రజాప్రతినిధులైనా ఈ స్కూల్ ఆక్రమణ విషయం పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం అందించాలి

దర్శి : రైతులకు శాస్త్రవేత్తలు శాస్త్రీయ పరిజ్ఞానం అందించాలని కృష్ణమండలి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం లాంఫామ్ గుంటూరు సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి. సుబ్బారావు తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు గతేడాది వివిధ విభాగాలలో చేపట్టి క్షేత్రపరిశీలనను ప్రథమశ్రేణి పరిశోధన క్షేత్రాల ఫలితాల గురించి సభలో వివరించాలన్నారు. ఈ సందర్భంగా 2023-24వ సంవత్సరం చేపట్టబోయే ప్రణాళికలను ప్రోగ్రామ్ కోఆర్డినేటరు డాక్టర్ దుర్గాప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి. హనుమంతరావు, డాక్టర్ చెంగళరావు, వెంకటరమణ, నిర్మల, ఆదిరెడ్డి, శాస్త్రవేత్తలు ఉష, జాహ్నవి, శివ, వెంకటేశ్వరరెడ్డి, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసిందీ నేనే..

'వెలిగొండ'ను ప్రారంభించేదీ నేనే..

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వెలిగొండ ప్రాజెక్టుకు నాడు శంకుస్థాపన చేసింది తానేనని, మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పనులను పూర్తి చేసి ప్రాజెక్ట్‌ను ప్రారంభించేదీ తామేనని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు నేతత్వంలో పెద్దారవీడు మండల రైతులు శుక్రవారం చంద్రబాబును కలిసి.. తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ఉమ్మడి ఏపిలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రకాశం జిల్లా కరువు ప్రాంత అవసరాలను గుర్తించి తాను వెలిగొండ ప్రాజెక్టుకు తలపెట్టినట్లు తెలిపారు. 2004 తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు సాగలేదని అన్నారు. 2014 తరువాత మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కాంట్రాక్టర్లతో ఉన్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించి పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లో మిగిలి ఉన్న 10 శాతం పనులను కూడా పూర్తి చెయ్యలేకపోయిందని దుయ్యబట్టారు. 2019లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020కే వెలుగొండ ప్రాజెక్టు పూర్తయ్యేదన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా జగన్ నాశనం చేశాడని, సిఆర్‌డిఎకు అప్పులు ఇచ్చిన బ్యాంకులు ఇప్పుడు వసూలు కోసం నేరుగా రావడం రాష్ట్ర దుస్థితికి నిదర్శనమన్నారు. ఒకప్పుడు తెలంగాణలో భూముల రేట్లు తక్కువ ఉండేవని.. ఇప్పుడు వైసిపి పాలనలో ఏపిలో భూముల రేట్లు పడిపోయి తెలంగాణలో రేట్లు పెరిగాయని అన్నారు. ఇప్పటికీ రాజధాని విషయంలో లేని అధికారం ఉందని చెబుతూ జగన్ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వడంతో పాటు వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ

(మొదటిపేజీ తరువాయి)

ఆయా వర్గాల్లో చర్చకు వస్తున్నాయన్నారు. సిఎం అయ్యాక జగన్ వీటిని మరిచిపోయారనే చర్చ ఆయా వర్గాల్లో ఉందన్నారు. వీటిపై గతంలోనూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పోరాడారని, వాటిని కూడా ప్రచారంలో ప్రస్తావిస్తున్నామన్నారు. ఈ రోజుకూ ఉపాధ్యాయులకు వేతనాలు రాలేదన్నారు. ప్రచారంలో అన్ని వర్గాల నుంచి మంచి స్పందన, ఆదరణ వస్తుందన్నారు. ఓటర్లుగా ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లలోనూ చర్చ సాగుతోందన్నారు. ఎవరికి ఓటు వేయాలనేదీ ఆలోచిస్తున్నారని గుర్తు చేశారు. పిడిఎఫ్ ఉంటేనే మేలు జరుగుతుందనే చర్చ ఉద్యోగ వర్గాల్లో బాగా ఉందని చెప్పారు. పార్టీల నుంచి పోటీచేస్తున్న అభ్యర్థులు గిప్టులు అక్కడ పెట్టిపోతున్నారని, ఉపాధ్యాయులు వాటి పట్ల ఆసక్తిగా లేరన్నారు. పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు కేవలం డబ్బు, ప్రలోభాలతోనే గెలవాలనే ఆలోచన చేస్తున్నారన్నారు. ఉద్యోగులు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్, నిరుద్యోగుల సమస్యలు వీరికి అంత ప్రాధాన్యత లేదన్నారు. ఓటర్లు ఆలోచించి సానుకూల నిర్ణయమే తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్రహోత్సవాలు ప్రారంభం

పొదిలి : ఈనెల 18న మహా శివరాత్రి పండుంగ సందర్భంగా స్థానిక శ్రీ పార్వతీసమేత నిర్మామహేశ్వరుడి ఆలయంలో బ్రహోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ చేశారు. నేటి సాయంత్రం నుంచి బ్రహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బనరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ యక్కలి శేషగిరిరావు మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కాటూరి వెంకటనారాయణ బాబు, రథ సారధి శామంతపూడి నాగేశ్వరరావు, చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీను, వినోద్ కుమార్, యవెంకటేశ్వరరెడ్డి, కొత్తూరి శ్రీను, రమేష్, వాకా సుబ్బారెడ్డి, శ్రీనివాస రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి..

విశ్వ బ్రాహ్మణ సంఘం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఆస్తికి అడ్డు వస్తున్నారని జన్మనిచ్చిన తల్లి, రక్తం పంచుకు పుట్టిన అక్కపై విచక్షణ రహితంగా దాడికి తెగబడ్డ నిందితుడిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు సిద్ది ఆత్మ లింగాచారి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ద్రోణాదుల గ్రామంలో నూతక్కి వీరనారాయణ తన తల్లి జయమ్మ, అక్కలు పార్వతి, సుభాషిణిలపై ఆస్తి కోసం దారుణంగా దాడి చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ద్రోణాదుల గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్తి వివాదాలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలే కానీ, కుటుంబ సభ్యులని చూడకుండా విచక్షణ రహితంగా భౌతిక దాడులు పాల్పడటం దారుణమన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ సంఘం తరపున అండగా నిలుస్తామని అన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో చికిత్స పొందుతున్న జయమ్మ ఆపరేషన్‌కు అయ్యే వైద్య ఖర్చులను కుమారుడు వీరనారాయణ నుంచి ఇప్పించాలన్నారు. రు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-దర్శి: తాళ్లూరు మండలం లక్కవరం గ్రామానికి చెందిన తూము సాయికల్యాన్‌రెడ్డి అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీరు(22) తాను నడుపుతున్న ట్రాక్టరు అదుపుతప్పి రావికుంట వాగులో బోల్తాకొట్టి తన పైన పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తూము వెంకట సుబ్బారెడ్డి- సుబ్బారావమ్మల ఏకైక కుమారుడు తూము సాయికల్యాన్ రెడ్డి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తూ శుక్రవారం తన ఇంటి వద్ద నుంచి ట్రాక్టరును నడుపుతూ మేత మోపులకై పొలానికి వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. దీంతో తమ ఏకైక కుమారుడు మృతి చెందటంతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. తాళ్లూరు ఎస్ఐ మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'హమారా'పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి

చీరాల వన్ టౌన్‌లో ఫిర్యాదు చేసిన ప్రజా సంఘాలు

ప్రజాశక్తి-చీరాల

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను కించపరుస్తూ సోషల్ మీడియా వేదికగా మాట్లాడిన హమారా ప్రసాద్ అనే వ్యక్తిపై దేశద్రోహం, పీడీ యాక్ట్‌ల కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హమారా ప్రసాద్ వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక ముక్కోనప పార్క్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొద్దిసేపు నిరసన తెలియజేసి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు కంచర్ల చిట్టిబాబు ఎల్ జయరాజు, రవికుమార్, గోసాల సుధాకర్, గోసాల అశోక్, రవి పలువురు మాట్లాడుతూ హమారా ప్రసాద్ అనే వ్యక్తి అంబేద్కర్ రచించిన పుస్తకాల గురించి సోషల్ మీడియాలో ప్రస్తావిస్తూ గాంధీని గాడ్సే చంపినట్లు ఆనాటి కాలంలో తాను ఉన్నట్లయితే అంబేద్కర్‌ను కూడా కాల్చి చంపేవాడిని అంటూ మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే పార్టీల మెప్పు కోసం హైదరాబాద్ తెలంగాణ వాసి హమారా ప్రసాద్ భారతదేశ ప్రజల ఆరాధ్య దైవం అయిన బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నాడని, అలాంటి వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేసి నగర బహిష్కరణ చేయాలని అన్నారు. ఇలాంటి వ్యక్తులు దేశంలో ఉంటే శాంతి



వన్ టౌన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

భద్రతలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. కావున తక్షణమే హమారా ప్రసాదును చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోకుంటే ప్రజాసంఘాలన్నీ కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమాలు చేయటానికి సిద్ధంగా ఉన్నాయని, ఆపై జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఒకటో పట్టణ సీఐ మల్లికార్జునకు హమారా ప్రసాద్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలంటూ ప్రజాసంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బొమ్మల రత్నాకర్ కుంభ రమేష్, ఎం దీనరాజు, రవికుమార్, రత్నరాజు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్వతంత్ర ఆలోచనలతోనే మానవాభివృద్ధి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

స్వతంత్ర ఆలోచనలతోనే మానవాభివృద్ధి సాధ్యమని భారత హేతువాద సంఘం కోశాధికారి షేక్ బాబు పేర్కొన్నారు. ఇంకొల్లు రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ 32వ వార్షికోత్సవం, హేతువాద, మానవవాద అధ్యయన తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం మన దేశంలో అత్యధికులు మతాల్లో, కులాల్లో, జాతుల్లో, వర్గాల్లో ఇతర సంకుచిత సిద్ధాంతాల్లో ఇరుక్కుపోయి ఉన్నారని, వారందరినీ చైతన్య పరిచేందుకు హేతువాద, మానవవాద అధ్యయన తరగతులు దోహదపడతాయన్నారు. మానవునికి స్వతంత్ర ఆఆలోచన వస్తే వారి సమస్యను వారే పరిష్కరించుకుంటారన్నారు. నేడు కులమతాలను ఆసరా చేసుకొని రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. మనుషుల్లో స్వతంత్ర చింతన, సహేతుక చింతన, సహేతుక ఆలోచన పెంపొందిస్తేనే మనిషి ఆలోచిస్తాడని, తద్వారా మెరుగైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని బాబు పేర్కొన్నారు. ఆధునిక ప్రపంచంలో మత ఫండమెంటలిజం అంశంపై బాబు, ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం కోశాధికారి కరణం రవీంద్రబాబు మాట్లాడారు. మతం-హేతువాదం అంశంపై షేక్ దరియావలి, డి రాజశేఖర్ మాట్లాడారు. మేడూరి సత్యనారాయణ రచించిన జీవోత్పత్తి-జీవపరిణామం-మానవ పరిణామం గ్రంథాన్ని ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ఆలూరి ప్రఫుల్ల చంద్ర ఆవిష్కరించారు. డాక్టర్ గుమ్మా వీరన్న రచించిన భారతీయ తత్వదర్శనం-బౌద్ధం గ్రంథాన్ని మేడూరి సత్యనారాయణ ఆవిష్కరించారు. మేడూరి సత్యనారాయణ రచించిన మానవవాదం-రాజకీయాలు-మానవ భవిష్యత్తు గ్రంథాన్ని షేక్ బాబు ఆవిష్కరించారు. భౌతిక వాస్తవిక వాదం-హేతువాదం అంశంపై మేడూరి సత్యనారాయణ మాట్లాడారు. హేతుబద్ధ ఆలోచన-మానవవాద జీవన విధానం అంశంపై కుర్రా హనుమంతరావు మాట్లాడారు. మేడూరి సత్యనారాయణ రచించిన వైజ్ఞానిక ప్రయోగాలు గ్రంథాన్ని కరి హరిబాబు ఆవిష్కరించారు. రావిపూడి వెంకటాద్రి రేషనలిస్ట్ అండ్ హ్యూమనిస్ట్ మూవ్‌మెంట్ గ్రంథాన్ని మేడూరి సత్యనారాయణ ఆవిష్కరించారు. సమావేశానికి కేరళ రాష్ట్రం నుంచి ఏడుగురు ప్రతినిధులు హాజరయ్యారు. కేరళకు చెందిన విద్యార్థిని ప్రత్యేక నృత్యం నిర్వహించింది.

మొక్కుబడిగా భద్రతా వారోత్సవాలు

వరుస ప్రమాదాలతో బేజారవుతున్న పొదిలి ప్రాంతం ● పేరుకే ఉత్సవాలు ● కానరాని భద్రత ● పత్తాలేని రవాణా శాఖ

ప్రజాశక్తి-పొదిలి

ఇటీవల రెండు వారాల క్రితం పొదిలి లారీస్టాండ్‌లో దర్శి మోటారు వాహనాల తనిఖీ అధికారుల పర్యవేక్షణలో 34వ జాతీయ భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. జనవరి 18 నుండి 24 వరకు వారోత్సవాలలో భాగంగా 22వ తేదీన పొదిలిలో లారీ డ్రైవర్‌లకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించిన అధికారులు తరువాత తాము ఉన్నట్టు చెప్పుకునే విధంగా గుర్తింపు కోల్పోయారు. మొక్కుబడిగా భద్రతా వారోత్సవాలు ముగిసిన తరువాతే ఈ ప్రాంతంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. మద్యం సేవించి వాహనం నడుపరాదనే నినాదం ఎక్కడా అమలు కావడంలేదు. ఇటీవల వరుస ప్రమాదాలలో వారోత్సవాల ముగింపునకు ముందు రోజు జనవరి 23వ తేదీన పట్టపగలు ఒక ఆటోడ్రైవర్ తప్పతాగి ఇష్టారాజ్యంగా నడుపుతూ పట్టణంలోని ప్రధాన రహదారిలో పెద్దమసీదు వద్ద రాంగ్ రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టాడు. తాగిన మైకంలో అప్పటికే ఒకసారి ఉడుముల వైద్యశాల వద్ద ఆటోను పడేశాడు. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడి ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఇది జరిగిన నాలుగు రోజులకు 28వ తేదీన మార్కాపురం సబ్‌కలెక్టర్ సేతుమాధవన్ కారు ప్రమాదానికి గురైంది. సాక్షాత్తు ప్రభుత్వ ఉన్నతాధికారి వాహనాన్ని టిప్పర్ ఢీ కొట్టడంతో డ్రైవర్ ప్రాణా పాయస్థితికి చేరాడు. ప్రమాదానికి కారకులు



సబ్ కలెక్టర్ కారు ప్రమాదం జరిగిన దృశ్యం (ఫైల్)

ఎవరైనా సంఘటన జరిగిన తీరు వాహన చోదకుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. మరో రెండు రోజులకు పొదిలి పట్టణంలోని మార్కాపురం అడ్డ రోడ్డు వద్ద కారు మోటారు సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి ప్రమాదాలు పొదిలి పట్టణంలో నిత్యకృత్యమయ్యాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత శుక్రవారం పొదిలికి వస్తున్న ఆర్‌టిసి బస్సు తమకు సైడ్ ఇవ్వలేదని మద్యం మత్తులో ఉన్న మర్రిపూడి మండలానికి చెందిన వాహన చోదకులు డ్రైవర్‌పై దాడికి ప్రయత్నించారు. మరుసటి రోజు తెల్లవారుజామున పొదిలి పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన కారును ఎదురుగా వస్తున్న టిప్పర్ రాంగ్ రూట్‌లో దూసుకువచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు డ్రైవర్ సమయస్ఫూర్తితో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ప్రాణ నష్టం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలా వరుస ప్రమాదాలతో పొదిలి, కొనకమిట్ల, మర్రిపూడి మండల ప్రజలు నిత్యం ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పొదిలి పట్టణంలో ప్రతి చోట రోజు చిన్న పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికి ప్రధానంగా కొందరు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడపడం ఒకటైతే, తల్లిదండ్రుల అతిగారాబంతో వారు కొనిచ్చిన అతి ఖరీదైన వాహనాలను విచ్చలవిడిగా నడుపుతున్న విద్యార్థులు మరో కారణంగా ఉంది. వీటికి తోడు పట్టణంలో రహదారి విస్తరణ లేక మితి మీరిన వేగం ప్రమాదాలకు కారణమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో వారం రోజులు భద్రతా వారోత్సవాలు నిర్వహించి దర్శి రవాణా శాఖ అధికారులు చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరికి తోడు స్థానిక పోలీసులు కూడా ప్రతి శనివారం నో ఆక్సిడెంట్‌డే అంటూ మొక్కుబడి తనిఖీలు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్న యువత, మద్యం ప్రియులు, వాహన చోదకులు సంయమనం పాటించి అందమైన జీవితాలను ప్రమాద రహితంగా మలచుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

యువతి మృతదేహానికి పోస్టుమార్టం

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని ఉమామహేశ్వరపురం అగ్రహారం గ్రామానికి చెందిన గూడాల కిరణ్మయి విశాఖపట్నంలో బిటెక్ చదువుతూ సంక్రాంతి సెలవులకు అగ్రహారం గ్రామం వచ్చి జనవరి 11వ తేదీ పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలిని తల్లిదండ్రులు, బంధువులు ఖననం చేశారు. మృతురాలి సెల్‌ఫోన్‌లో గ్రామానికి చెందిన చింతల వెంకటనారాయణరెడ్డి సెల్ ఫోన్ నెంబరు ఉండడంతో అతనిపై అనుమానం వచ్చి కిరణ్మయి తండ్రి గూడాల సుబ్బారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా దిశ డిఎస్‌పి పల్లవరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు మెడికల్ కాలేజి ప్రొఫెసర్ డాక్టర్ సురేష్, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ మాధురి ఆధ్వర్యంలో ముండ్లమూరు తహశీల్దారు ఉషారాణి పంచనామా నిర్వహించి ఆమె సమక్షంలో బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ డిఎస్‌పి మాట్లాడుతూ గ్రామానికి చెందిన వెంకటనారాయణ కిరణ్మయిని బ్లాక్ మెయిల్ చేసి నగ్నచిత్రాలు యూట్యూబ్‌లో పెడతానని బెదిరించడంతో భయపడి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాత నిందితుడిని కోర్టులో హాజరుపర్చి కేసును విచారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎల్ సంపత్‌కుమార్, విఆర్‌ఓ దయానందం, పోలీసు సిబ్బంది, మృతురాలి బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

50 గొర్రెలు చోరీ

ప్రజాశక్తి-ముండ్లమూరు

మండలంలోని పోలవరం గ్రామంలో సన్నెబోయిన వెంకట్రావుకు చెందిన 30 పెద్దగొర్రెలు, 20 గొర్రె పిల్లలు గురువారం అర్ధరాత్రి చోరీకి గురైనట్లు ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొర్రెల దొడ్డిలో రోజులాగే గొర్రెలు తోలి ఇంటికి వచ్చి పడుకున్నానని తెలిపాడు. మధ్య మధ్యలో చూసినప్పుడు రాత్రి ఒంటిగంట సమయంలో కూడా గొర్రెలు ఉన్నాయని తెలిపాడు. మూడు గంటల సమయంలో వచ్చి చూసేసరికి గొర్రెలు కనిపించలేదని, గుర్తు తెలియని వ్యక్తులు తోలుకుపోయారని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. ఎస్ఐ సంపత్‌కుమార్, శంకరాపురం, అద్దంకి భవానీ సెంటర్‌లోని సిసి ఫుటేజీలను పరిశీలిస్తామని, ఆ సమయంలో వాహనాలు, ఎవరైనా ఉంటే విచారిస్తామన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-పర్చూరు: మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నాగభైరు అప్పారావు, సుజాతల జ్ఞాపకార్థం కుమారుడు కిషన్‌కుమార్, కుమార్తె అనితలు ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. కాటూరి మెడికల్ కళాశాల వైద్యులతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు వైద్య శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-రేపల్లె

స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ రవిచంద్ర అధ్యక్షతన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రవిచంద్ర మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్త దానం మిన్న అన్నారు. రక్తదానం వల్ల ఆపదలో ఉన్న క్షతగాత్రుల ప్రాణాలను రక్షించవచ్చునని పేర్కొన్నారు. కనీసం ఏడాదికి రెండు సార్లయినా రక్తదానం చేయాలని అన్నారు. ప్రాణదానానికి మారుపేరు రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా 25 మంది రక్తదాతలను అభినందించారు.

ఈ కార్యక్రమంలో రేపల్లె ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ వీరరాఘవయ్య, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఏబీఎన్ డిగ్రీ కాలేజ్ అధ్యాపక బృందం మిగతా అతిథులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

శాసనమండలి ఎన్నికల ప్రకటనతో బాపట్ల జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె విజయకృష్ణన్ చెప్పారు. శాసనమండలి ఎన్నికల ప్రకటనతో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు మార్చి 13వ తేదీన బాపట్ల జిల్లాలో జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి అధికారులు పనిచేయాల్సివుంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 16వ తేదీన అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియకు ప్రకటన విడుదల చేయాల్సి ఉందన్నారు. 23వ తేదీతో నామినేషన్ల స్వీకరణ గడువు ముగుస్తుందన్నారు. 24న నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 27న అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి అవకాశం ఉందన్నారు. మార్చి 13వ తేదీన ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. బాపట్ల జిల్లా పరిధిలోని 13 మండలాలలో శాసనమండలి ఎన్నికలు జరుగుతాయని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 17,626 పురుష గ్రాడ్యుయేట్ ఓట్లు ఉండగా, 8,745 మహిళా గ్రాడ్యుయేట్ ఓట్లు, ఇతర కేటగిరిలో ఒకరు ఉన్నారని చెప్పారు. మొత్తంగా బాపట్ల జిల్లాలో 26,372 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. గ్యాడ్యుయేట్స్ నియోజవర్గం పరిధిలో 24 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఉపాధ్యాయ నియోజకవర్గం పరిధిలో 13 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో 1,400 లోపు మాత్రమే ఓటర్లు ఉండాలన్నారు. ఆ సంఖ్యకు మించితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటరు 16 కిలోమీటర్లలోనే ఓటు వేయాలనే నిబంధనను విస్మరించరాదన్నారు. పోలింగ్ కేంద్రాలను అధికారులు యుద్ధప్రాతిపదికన తనిఖీచేసి సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణన్ ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో తప్పనిసరిగా ర్యాంప్ ఉండాలని, కేంద్రానికి తలుపులు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించి కలెక్టరేట్‌కు నివేదించాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. నకిలీ ఓటర్ల తొలగింపుపై ఓటర్ల జాబితాను తిరిగి పరిశీలించాలన్నారు. ఓటర్ల ఫిర్యాదుల స్వీకరణకు జిల్లాస్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు అధికారులు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలన్నారు. వీడియోగ్రఫీ, వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారుల నియామకానికి గజిటెడ్ అధికారులు వివరాలను తెప్పించుకోవాలని డిఆర్‌ఓను కలెక్టర్ ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ బూతు నిర్వహణపై అధికారులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికలపై పరిశీలకులను నియమించి ప్రత్యేక శిక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె శ్రీనివాసులు, ఏఎస్‌పి పి మహేష్, డిఆర్‌ఓ కె లక్ష్మీశివజ్యోతి, బాపట్ల, చీరాల ఆర్‌డిఓలు జి రవీందర్, పి సరోజని, జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



మస్తాన్‌వలి,

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఇంకొల్లు మండల నూతన కార్యవర్గ ఎన్నికైంది. శుక్రవారం ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా పి సత్యనారాయణ, అధ్యక్షులుగా షేక్ మస్తాన్‌వలి, ఉపాధ్యక్షులుగా ఎ శ్రీమన్నారాయణ, దుర్గ, ప్రధాన కార్యదర్శిగా ఎస్ ఇమ్మానియేలు, కోశాధికారిగా ఎం మాధవ, జిల్లా కౌన్సిలర్స్‌గా కెఎం విజయకుమారి, సిహెచ్ శివరామకృష్ణప్రసాద్, కవల నాగేశ్వరరావు, కార్యదర్శులుగా కెజెఆర్ కుమారి, తగిరిశ శ్రీనివాసరావు, పి రామారావు, బి శివప్రసాద్, కె వీరారెడ్డి, కట్టా సురేష్, మాగిశెట్టి శ్రీనివాసులు, వివిధ కమిటీల కన్వీనర్లుగా జె ప్రభాకర్‌రావు, కె పుష్పావతి, కె షణ్ముఖి, కె శ్రీనివాసరావు, జె గోపికృష్ణ, కన్వీనర్‌గా ఎం శాంతిప్రియ, మహిళా కమిటీ కన్వీనర్‌గా పి పావని ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి యు చెంచయ్య వ్యవహరించారు.



కుర్చీలు బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

పాఠశాలకు ఫర్నీచర్ బహూకరణ

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని రామిరెడ్డిపాలెం ఎంపీపీ ఎస్ పాఠశాలకు, ఏల్చూరు 1984 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఫర్నిచర్ బహూకరించారు. పూర్వ విద్యార్థులు ఏల్చూరి శ్రీనివాసరావు, వేల్పుల రేణుక, జె నాగేశ్వరరావు, పూర్ణ మాస్టారు, ఎం శ్రీనివాసరావులు పాఠశాలకు బీరువా, కుర్చీలను, మండల విద్యాశాఖ అధికారి వేమవరపు కోటేశ్వరరావు చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయులు పుచ్చకాయల కోటేశ్వరరావుకు అందజేశారు. రామిరెడ్డి పాలెంలోని ఎంపీపీ ఎస్ పాఠశాల అభివృద్ధిని చూసి, పిల్లల చదువును పరిశీలించి వారికి బీరువా, కుర్చీలను అందజేసినట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి అయిన రేణుక విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వి కోటేశ్వరరావును, ప్రధానోపాధ్యాయులు పి కోటేశ్వరావుని పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచి, పాఠశాలలను బలోపేతం చేయాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఘన వ్యర్థాల నుంచి సంపద సృష్టి

ప్రజాశక్తి-కర్లపాలెం: ఘన వ్యర్థాల నుంచి సంపద సృష్టించవచ్చునని మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. శుక్రవారం కర్లపాలెం మండలం దమ్మన్నవారిపాలెం గ్రామంలో సంపద సృష్టి కేంద్రంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేస్తే దాని నుంచి సంపద సృష్టించవచ్చని అన్నారు. తడి చెత్తతో మొక్కలకు ఎరువు అందించవచ్చని అన్నారు. అదే విధంగా పంచాయతీకి ఆదాయం వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ శరత్ బాబు, మండల అధ్యక్షురాలు యారం వనజ, సర్పంచ్ గుర్రపుశాల వెంకటేశ్వరమ్మ, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి వెళ్లేదెలా?

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

22 కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయానికి వెళ్లి పనులు చేసుకోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని బాపట్ల మండలం అడివి 2 సచివాలయ పరిధి గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామ సచివాలయ వ్యవస్థను తెచ్చింది. ఇందులో భాగంగా ఆయా గ్రామాలు కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి 2 వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. అయితే అప్పుడు పరిస్థితుల దృష్ట్యా భవనం ఉంది అన్న ఒకే ఒక కారణంగా అడివి 2 సచివాలయం, ఆడివి పల్లె పాలెంలో ఏర్పాటు చేశారు. ఈ సచివాలయ పరిధిలోని ఆదర్శ నగర్, హనుమాన్ నగర్, రామ నగర్, సూర్యలంక గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజలు సచివాలయానికి వెళ్లాలంటే 22 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిందే. పైగా బస్సు సౌకర్యం కూడా లేదు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో పలుమార్లు ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలకు కావాల్సిన సేవల కోసం సిబ్బందినే ఆయా గ్రామాలకు పంపుతున్నారు. దీనివలన సచివాలయ సిబ్బంది సైతం వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. మరల కంప్యూటర్ పని ఫొటోస్టాట్ డాక్యుమెంట్ ప్రింటింగ్ వంటి పనులకు సచివాలయానికి పరిగెత్తే పరిస్థితి. కావున సచివాలయ భవనాన్ని సూర్యలంక శివారు దగ్గర గ్రామంలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇఒపిఆర్‌డి వివరణ

ఈ విషయాన్ని ఈఓపిఆర్ డి శరత్ బాబుని వివరణ కోరగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు అడివి 2 సచివాలయాన్ని దగ్గరలోని హనుమాన్ నగర్ గ్రామంలో ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దశకు చేరుకున్నాయని తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ వెల్లడి



మాట్లాడుతున్న అబ్దుల్ సత్తార్

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు వ్యవసాయాధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ హాజరయ్యారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలను గురించి వివరించారు. రైతులు తప్పనిసరిగా వారు వేసిన పంటను నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకోని రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు ఏమీ వర్తించవని పేర్కొన్నారు. కావున రైతులంతా తప్పనిసరిగా పంట నమోదు చేయాలని సూచించారు. అర్హులైన రైతులందరూ సిఎం కిసాన్ ద్వారా ఇకెవైసి చేయించుకోవాలని అన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు తీసుకోవాలని సూచించారు. మండల సలహా కమిటీ చైర్మన్ కోట హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల రైతులలో అవగాహన కల్పించాలని రైతు భరోసా సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఏడిఏ మోహన్‌రావు, మండల వ్యవసాయాధికారి ఎస్ రామమోహన్‌రెడ్డి, సలహా కమిటీ సభ్యులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ శిక్షణకు బాపట్ల 'వ్యవసాయ' విద్యార్థులు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ వ్యవసాయ శిక్షణకు ఎంపికకైనట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ వ్యవసాయ విద్యా వికాసానికి ఎంతగానో దోహదపడు తుందని అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్, ఐఐఎస్‌డబ్ల్యుయుసి డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి శిక్షణకు బాపట్ల వ్యవసాయ కళాశాల బిఎస్సీ ద్వితీయ సంవత్సర విద్యార్థినీ విద్యార్థులు ఎంపికయ్యా రన్నారు. ప్రభావవంతమైన వ్యవసాయం కోసం సమర్థవంతమైన నీటి నిర్వహణ అనే వ్యవసాయ ప్రధాన అంశంపై శిక్షణను ఈ నెల 13 నుంచి మార్చి 13 వరకు జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన వివరించారు. అదేవిధంగా స్థిరమైన వ్యవసాయం కోసం మొక్కల ఆరోగ్య నిర్వహణ' అనే మరో అంశంపై శిక్షణ కోసం మరికొందరు విద్యార్థినీ విద్యార్థులు హైదరా బాదులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ సంస్థకు ఎంపికయ్యారు. ఈ నెల 14 నుంచి మార్చి 6వ తేదీ వరకు మొక్కల ఆరోగ్య పరిరక్షణ పట్ల శిక్షణ పొందనున్నట్లు ఆయన వివరించారు. పూర్తి స్థాయి మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఈ జాతీయ శిక్షణలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కె చంద్రశేఖర్, వి సీతా రాంబాబు, బి రత్నకుమారి పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో బిజినెస్ మేన్‌గా ఎదగండి

ప్రజాశక్తి-వేటపాలెం

స్వయం ఉపాధి ద్వారా వ్యాపారవేత్తగా ఎదగడానికి ప్రభుత్వపరంగా విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని ఎంఎస్‌ఎంఇ ఎడి డి వీరయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేశాయిపేట ఉమ్మిటి శివయ్య ఐటిఐ కాలేజ్‌లో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఐటిఐ కాలేజ్ కరస్పాండెంట్ యారాసు నీలకంఠేశ్వరరావు అధ్యక్షత వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ వీరయ్య ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వ్యాపారవేత్తగా ఎదగాలనే దృఢ నిర్ణయం, ఉత్పత్తి ఎంపిక, యూనిట్ యొక్క నమోదు స్థానం, ప్రాజెక్ట్ నివేదిక, ఫైనాన్స్ పొందడం, చట్టబద్ధమైన లైసెన్స్‌లు పొందడం వంటి విషయాల గురించి క్షుణ్ణంగా వివరించారు. స్వయం ఉపాధి రంగాల్లో విజయం సాధించడం వలన మరి కొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునన్నారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ స్థాపించుకొని ఉపాధి పొందుతూ మరి కొంతమందికి ఉపాధి కల్పిండం కంటే మించింది మరొకటి లేదన్నారు. ప్రిన్సిపాల్ బికెవి సుబ్బారావు, ఈపురుపాలెం ఐటిఐ కాలేజ్ కరస్పాండెంట్ ఎస్‌ఎ సత్తార్, ప్రిన్సిపాల్ కెవిపి శేషయ్య చీరాల ఐటిఐ కాలేజ్ కరస్పాండెంట్ టి రవికుమార్, వెటర్నరీ డాక్టర్ ఆనంద్ భాగ్యరాజ్‌లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవన హరిప్రసాద్, బండ్ల వేణు పాల్గొన్నారు.

రజకుల భూమిని వారికే కేటాయించాలి

ప్రజాశక్తి-చీరాల: రజకుల భూమిని రజకులకే కేటాయించాలని రజక వృత్తిదారుల సంఘం నాయకులు పి కొండయ్య అన్నారు. కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో రజకులకు కేటాయించిన స్థలాన్ని పంచాయతీ ఆపాలని చూస్తోందని, ఆ భూమి రజకులకే కేటాయించాలని గ్రామ రజకులు ఎమ్మార్వోకు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు రాఘవయ్య మాట్లాడుతూ ఆ స్థలంలో రజకులు ఏళ్ల తరబడి తమ వృత్తి చేసుకుంటున్నారని, ఆ విషయం గ్రామంలో ఎవరిని అడిగినా చెప్తారని అన్నారు. జీవో నెంబర్ 343 ప్రకారం చెరువులపై రజకులకు హక్కు ఉందని తెలుగుదేశం పార్టీ సాధికార కమిటీ బాపట్ల పార్లమెంట్ కమిటీ సభ్యులు పోలూరు సింగయ్య అన్నారు. రజకులకు కేటాయించిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. కావున తమ స్థలాన్ని తమకు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

త్రిపురలో ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాబు

ప్రజాశక్తి-చీమకుర్తి

త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాలని, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు కోరారు. త్రిపుర మరియు పలు రాష్ట్రాలలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా నిర్వహించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనం నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్‌కె. మాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మతోన్మాద ప్రభుత్వం మత ఉద్రిక్తల ద్వారా అల్లర్లు సృష్టించడం, డబ్బుతో ప్రాంతీయ పార్టీల అభ్యర్థులను



:మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు

కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. బిజెపి గెలువక పోతే ఎన్నికయిన ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను అస్థిరపరచడం ద్వారా దేశంలో అప్రజాస్వామ్య చర్యలకు పాల్పడు తుందన్నారు. ఈ విధానాలను అన్ని పార్టీలు వ్యతిరేకించాలన్నారు. దేశంలో త్రిపుర ,ఇతర రాష్ట్రాలలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకటరావు, కాలం సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాట వెంకటరావు,మండల నాయకులు కొల్లూరి వెంకటేశ్వర్లు, పల్లాపల్లి ఆంజనేయులు, టి. రామారావు, కంకణాల వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీను,కె.చిన్నపురెడ్డి, శీలం ఆదినారాయణ, బి.ఓబులేషు, బి.వీరాంజనేయులు, నాగయ్య, మాదాల నారాయణ, బక్కిరెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదు

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

నలభై సంవత్సరాల సీనియర్‌ని అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. దోర్నాలలోని ఎపి టూరిజంలో వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి అధ్యక్షతన గృహ సారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు వెన్నుపోటు రాజకీయం తప్ప స్వతహాగా ఎదిగిన వ్యక్తి కాదన్నారు. ఎన్నికల సమయంలో మభ్య పెట్టడం తప్ప గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం ఒంటిరిగా పోటీ చేయలేక నానా పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎంత మందిని కలుపుకొని పోటీ చేసినా



మాట్లాడుతున్న మంత్రి సురేష్

జగనన్న సింహంలా సింగిల్‌గానే పోటీ చేస్తారని 175 స్థానాల్లో విజయం సాధించి తిరిగి ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పాలనను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడంలో గహసారథులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పనిచేయాలని పిలువనిచ్చారు.. 2024లో వైసిపి గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కషి చేయాలన్నారు. ప్రతిపక్ష పార్టీల విమర్శలను ఆరోపణలను తిప్పికొట్టే విధంగా ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ విధానాలను వివరించాలని చెప్పారు. కష్టకాలలో ప్రజలను ఆదుకునేది పార్టీ శ్రేణులే అని అన్నారు. నియోజకవర్గంలో తాము చేస్తున్న అభివద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందని అన్నారు. రామన్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కషి చేయాలని పార్టీ శ్రేణులకు, గహ సారథులకు, సచివాలయ కన్వీనర్లుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దోర్నాల సర్పంచి చిత్తూరి హారిక, జడ్‌పిటిసి లతాబాయి, సర్పంచులు పవన్ కుమార్, వెంకట్రామయ్య, రమాదేవి, నాయకులు వెన్నా కాశిరెడ్డి, గుమ్మా యల్లేష్, ఒంటేరు నాగేశ్వరరావు, సచివాలయాల మండల కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.

చిత్రకారుడు చక్రవర్తి మృతి

పొదిలి : పొదిలికి చెందిన ప్రముఖ చిత్రకారుడుగా పావులూరి చక్రవర్తి శుక్రవారం తెల్లవారు జామున అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. పొదిలిలోని నిమ్మయ్య హోటల్ యజమాని పావులూరి నిమ్మయ్య చిన్న కుమా రుడు చక్రవర్తి స్వతహాగా మంచి చిత్రకారుడు. ఓ పెన్సిల్ ముక్కతో అద్భుతమైన, అందమైన చిత్రాలను క్షణాల్లో గీయగల నేర్పరి. గతంలో అతను పెన్సిల్ తోనే అద్భుతమైన చిత్రాలను గీచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలువురి ప్రశంసలు అందుకున్నారు. చక్రవర్తి మృత దేహాన్ని శు క్రవారం పొదిలికి తీసుకొచ్చారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అల్లూరులో 'కాఫీ విత్ క్లాప్‌మిత్ర'

కొత్తపట్నం : మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలు ఇంటింటికీ తిరిగి తడి చెత్త ,పొడి చెత్త వేరు చేయుట గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అర్చన. ఎంపిడిఒ, సుజాత, ఇఒఆర్‌డి బాల చెన్నయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రమాదేవి , పంచాయతీ కార్యదర్శి రామారావు. హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో పాలు పంచుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి-పొదిలి

ప్రజలు చిన్న చిన్న సమస్యలు, కక్షలకు స్వస్తి పలికి గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలని పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.భార్గవి అన్నారు. మండల పరిధిలోని కుంచెపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వరికుంట్ల కాంతమ్మ అధ్యక్షతన లోక్ అదాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామాలలో చిన్న చిన్న సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోడం ద్వారా శాంతి భద్రతలు విలసిల్లుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుమారుడు వరికుంట్ల అనిల్ కుమార్, ఎపిపి అరుణ కుమారి, న్యాయవాదులు వెంకటేశ్వర్లు, పెద్దన్న, సుజాత, అనిల్, రామారావు, ప్రవీణ్, గౌతమి, గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణం

ప్రజాశక్తి-పొదిలి

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 10వ తేదీ వరకూ జీతాలు చెల్లించకపోవడం దారుణమని యుటిఎఫ్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో కొనకనమిట్ల మండల విస్తత కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్ హై, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బొజ్జ కపారావు గోనే శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో 26 జిల్లాల్లో ఉపాధ్యాయులకు నేటి వరకు జీతాలు, పెన్షన్లు చెల్లించకపోవడం దారుణమని తెలిపారు. సచివాలయ, ఆర్‌టిసి, కొంతమంది ఎన్‌జిఒలకు జీతాలు చెల్లించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు జీతాలు చెల్లించకపోవడాన్ని ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యగా తాము భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

మావేశంలో కొనకనమిట్ల మండల గౌరవాధ్యక్షుడు రసింహారావు, జిల్లా కౌన్సిలర్లు శ్రీనివాసులు రెడ్డి , కోనంకి సంజీవరావు, చంద్రమౌళి, గుంటూరు ఐజాక్, కాసు తిరుపతి, బాబు వేమూరి శ్రీనివాసులు, తుళ్లూరి శ్రీనివాసులు, పొన్నపుచిన్న, కోట రాంప్రసాద్, హరిబాబు మద్రిపూడి వెంకట రమణయ్య, మునగ రామారావు తదితరులు పాల్గొన్నారు.




థెరిసాను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

బూచేపల్లి ఆశీర్వాదం

ప్రజాశక్తి-దర్శి

తాళ్ళూరు మాజీ ఎంపిపి గోళ్లపాటి మోషే మనుమరాలు ఎంజిల్ థెరిసా ఓణీల ఫంక్షన్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని చిన్నారి థెరిసాను దీవించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు పోశం మధుసూధనరెడ్డి, ఇత్తడి దేవదానం, దోసకాయలపాడు సర్పంచి కోట శివలక్ష్మి వెంకట నారాయణరెడ్డి, నాయకులు ఐవి.సుబ్బారెడ్డి, జి. యోగిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే స్వామి

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-కొండపి

కొండపి గ్రామానికి చెందిన పవన్‌సాయి వివాహ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, టిడిపి నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా మండల పరిధిలోని జాళ్లపాలెం గ్రామంలో భూమా కోటయ్య కుమారుడు వెంకటేశ్వర్లు వివాహ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టిడిపి నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జి.రామయ్యచౌదరి, నారాయణస్వామి, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య, జరుగుమల్లి మండల టిడిపి అధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-జరుగుమల్లి

మధ్యాహ్న భోజన మెనులో నాణ్యత పాటించాలని జరుగుమల్లి ప్రత్యేక అధికారి మాధవి తెలిపారు. మండల పరిధిలోని చింతలపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాధవి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో మెనూను తప్పక పాటించాలన్నారు. తర్వాత గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్ల పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ గృహ నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.రామకృష్ణ, గృహ నిర్మాణ డిఇ జయరావు, ఎఇ అవినాష్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-పొదిలి

పోలీసులు విధినిర్వహణలో మంచి ఫలితాలు సాధించాలంటే ఆరోగ్యం ఉండాలని జిల్లా పోలీస్ మెడికల్ అధికారి డాక్టర్ భానుమతి తెలిపారు. పొదిలి పోలీస్ స్టేషన్ ఆవరణలో పొదిలి సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బందికి గుండె సంబంధిత వ్యాధులకు శుక్రవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పొదిలి సిఐ సుధాకర్ రావు మాట్లాడుతూ విధులును నిర్వహించే క్రమంలో సిబ్బంది మంచి ఆరోగ్యం కలిగిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొనకనమిట్ల, తర్లుపాడు ఎస్‌ఐలు దీపికా,ముక్కంటి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణ..!

స్పందించని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో కొందరు రహదారులను సైతం వదలడం లేదు. మున్సిపాలిటీ నిర్మించిన సిమెంట్ రోడ్డుపై అడ్డుగా గోడ నిర్మాణం చేపట్టినా పట్టించుకునే వారు కనిపించడం లేదు. రహదారి ఆక్రమణతో కొందరికి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. బాధితులు అధికారుల ఎదుట మొర పెట్టుకున్నా ఆలకించే వారు కరువయ్యారు.

మార్కాపురం మున్సిపాలిటీ 18వ వార్డు పరిధిలో విద్యుత్ కార్యాలయం వెనుక భాగంలో సిమెంట్ రహదారి ఉంది. ఆ రహదారి చివరలో ఓ వ్యక్తి తన ఇంటి ముందు సిమెంట్ రోడ్డుపై అడ్డుగా గోడ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం అవతల భాగంలో సర్వే నెంబరు 411లో 5 సెంట్ల స్థలంలో ఓ గృహం ఉంది. ఆ గృహానికి గోడ నిర్మాణం చేపట్టిన రహదారి మాత్రమే ప్రధాన రహదారి. గోడ నిర్మాణం చేపట్టడంతో ఆ ఇంటికి వెళ్లేందుకు ప్రధాన



రహదారికి అడ్డుగా నిర్మించిన గోడ ఇదే..

రహదారి లేకుండా పోయింది. ఆక్రమణదారుడిని బాధితులు ఇదేమని ప్రశ్నిస్తే ఆ రహదారి స్థలం తనదేనని సమాధానం చెబుతున్నాడు. సర్వే నెంబరు 411లో 5 సెంట్ల స్థలానికి రహదారి ఇది కాదని వాదిస్తున్నాడు. సర్వే నెంబరు 411లోని 5 సెంట్ల స్థలానికి ఆక్రమించిన ప్రస్తుత ప్రధాన రహదారిని మాత్రమే రిజిష్టర్ డాక్యుమెంటులో చూపారు. ప్లాన్ రస్తా కూడా ఉంది. ఇవేమీ ఆక్రమణ దారుడిని అడ్డుకోలేకపోతున్నాయి. బాధితుడు కురుకుంద ప్రసాద్ పలుమార్లు ఇదెక్కడి అన్యాయమని సంబంధిత అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోతోంది. రహదారిలో గోడ నిర్మాణం అక్రమమా.... సక్రమమో తేల్చాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. రహదారిపై గోడ నిర్మాణం సరైనదా కాదా అనే విషయం తెలుసుకునేందుకు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌కు పలుమార్లు ప్రజాశక్తి సెల్‌ఫోన్ ద్వారా ప్రయత్నించినా స్పందించకపోవడం గమనార్హం.

రూ. 50 వేల చెక్కు అందజేత

పెద్దదోర్నాల : మండల పరిధిలోని చింతల ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు వివిధ క్రీడలలో పాల్గొని బహుమతులు సాధించారు. ఈ నేపథ్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడా దుస్తులు లేవని విద్యార్థులు మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన క్రీడా దుస్తులు కొనుగోలుకు రూ. 50 వేలు తన సొంత డబ్బులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు దోర్నాలలోని ఎపి టూరిజంలో శుక్రవారం రూ. 50 వేల చెక్కును చింతల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ బాల గురుస్వామికి అందజేశారు. కార్యక్రమంలో ఆ పాఠశాల పీడీ బాబు, కన్వీనర్ మంతన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్చి తోటలు పరిశీలన

కొండపి : మిర్చి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యాన శాఖ అధికారి డి.ప్రత్యూష తెలిపారు. కొండపి గ్రామంలో రైతులు సాగు చేసిన మిరపతోటలు శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం ప్రత్యూష మాట్లాడుతూ రైతులకు మిర్చి పంటకు అధిక నత్రజని ఎరువులను వినియోగించకూడదని తెలిపారు. సూక్ష్మదాతు లోపాలు తలెత్తకుండా చూడాల న్నారు. సల్ఫేట్ రూపంలో నత్రజని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు టివి. వెంకటనారాయణ, పి.భరత్‌కుమార్, ఎంఎఎ సుజాత , రైతులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకలు

కొండపి : విద్యార్థులు విలువతో కూడిన విద్య నభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 46వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులను గౌరవిం చాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి ఆర్.కోటరాజు, కళాశాల వ్యవస్థాపక కమిటీ మెంబర్లు బొక్కిసం సుబ్బారావు, ఆరికట్ల హరినారాయణ, ఆరికట్ల వెంకటరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి-కురిచేడు

మార్చిలో జరగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా సాగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని తహశీల్దారు నాగూల్ మీరా తహశీల్దారు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లా డుతూ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పొరపాట్లు జరగకుండా ఎన్నికలు సజావుగా జరగడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తామని తెలిపారు. సభలు, సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భార్గవి, ఎస్ఐ దేవకుమార్, ఎంఇఒ ఆర్. వస్త్రాం నాయక్ , టిడిపి మండల కన్వీనర్ నెమిలయ్య, సిపిఎం నాయకుడు పి. రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఆదానీ ఆస్తులను జప్తు చేయాలి

దర్శి : దేశంలో ఆర్థిక నేరస్తుడుగా పేరున్న ప్రపంచ కుబేరులలో ఒకరుగా ఉన్న గౌతమి అదానీ ఆస్తులను జప్తు చేసి జాతీయం చేయాలని సిపిఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి మాదపాకుల రమేష్‌బాబు కోరారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు, కరుణానిధి, జూపల్లి కోటేశ్వరరావు, తన్నీరు వెంకటేశ్వర్లు, రామయ్య, అరుణ, ప్రసాద్, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవి సీఫుడ్స్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండలోని దేవి సిఫుడ్స్ లిమిటెడ్ కంపెనీలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బ్రహ్మానందం పుట్టిన రోజు సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్త దాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీలో పని చేసే 100 మంది ఉద్యోగులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ మాంటిస్సోరీ ప్రకాష్ ,వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి మేనేజింగ్ కమిటీ సభ్యులు బివి. రెడ్డి, ప్రసన్న రాజు, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కష్టారావు, జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనివాస్, స్టాంటిన్ టెక్నీషియన్స్ రవి, వెంకటేశ్వర్లు, రాజ కుమార్, ప్రతిభ



రక్తదానం చేస్తున్న ఉద్యోగి

పాల్గొన్నారు. రక్త దానాన్ని ప్రోత్సహించిన దేవి సి ఫుడ్స్ యాజ మాన్యానికి రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

వినికిడి యంత్రం అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక కొండపి రోడ్డులోని వైసిపి కార్యాలయంలో శింగరాయకొండ మండలం పాకల గ్రామానికి చెందిన బత్తుల శివారెడ్డికి వినికిడి యంత్రాన్ని అందజేశారు. వైసిపి నాయకులు చింతపల్లి హరిబాబు, బీసీడి ఉదయ్ కుమార్ చేతుల మీదుగా గురువారం వినికిడి యంత్రాన్ని పంపిణీ చేశారు. గత కొంతకాలంగా వినికిడి సమస్యతో బాధపడుతున్న శివారెడ్డి విషయాన్ని స్థానిక వైసిపి నాయకులు అశోక్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి సమస్యను పరిష్కరించిన వరికూటి అశోక్ బాబు, మన్నం వెంకయ్య, వైసిపి నాయకులకు శివారెడ్డి కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ టంగుటూరి రామకష్ణ, ఎంపిటిసి కొమ్ము ప్రభుదాసు, వైసిపి నాయకులు కొమ్ము బుజ్జి, పాకల శ్రీను, రవి, ఏసు, ఎన్‌వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మొండిచెయ్యి

ప్రజాశక్తి-దర్శి

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మొండి చెయ్యి చూపారని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు విమర్శించారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం ఈమని నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి బయటకు తీస్తానని చెప్పిన మోడీ మాటలు నీటి మూటలయ్యాయన్నారు కేంద్ర బడ్జెట్‌లో ఆహారభద్రతకు రూ. 90 వేల కోట్లు, ఎరువులకు ఇచ్చే సబ్సీడిపై రూ. 50 వేల కోట్లు తగ్గించినట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైన పోర్టులు, విమానాశ్రయాలు, బ్యాంక్‌లు, ఇన్సూరెన్స్, రైల్వే, బొగ్గు గనులు ఆదానీ, అంబానీలకు అప్పజెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తాండవ రంగారావు, కమిటీ సభ్యులు నారాయణ, కాలేబాషా,



మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

నాగరాజులు పాల్గొన్నారు. **అర్ధవీడు :** కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ అధ్యక్షుడు పోరెడ్డిరంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం దారుణమని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌ను సవరించి వ్యవసాయానికి, ఉపాధి పథకానికి నిధులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు పేస్ యాప్‌ను తొలగించాలన్నారు. కనీస వేతనం నెలకూ రూ. 26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మునగాల వెంకటరెడ్డి, నాయకులు అంజి, రామ వెంకటేశ్వర్లు, కేశవరెడ్డి, తిరుపతయ్య ,సామేలు , రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు



అర్ధవీడులో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

15లోపు ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి-టంగుటూరు

ఈ పంట నమోదు,ఇకెవైసి ప్రక్రియను ఈ నెల 15లోపు పూర్తి చేయాలని ఒంగోలు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి. రమేష్ బాబు సూచించారు. స్థానికరైతు భరోసా కేంద్రం ఆవరణలో వ్యవసాయ శాఖ సలహా మండలి సమావేశం చైర్మన్ మల్లవరపు జయరామిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఈనెల 15న మండల పరిధిలోని వల్లూరు రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని వల్లూరు కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ జి. స్వర్ణలత, వ్యవసాయ విస్తరణాధికారులు ఎన్. వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

వెలిగండ్ల : ఎంపిపి రామన మహాలక్ష్మమ్మ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కంది, మినుము పంటలను నష్టపోయిన ప్రతి రైతుకు పంట నష్ట పరిహారం మరియు పంటల ఇన్సూరెన్స్ వర్తించేలాగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తమకు వ్యక్తి గతంగా వ్యవసాయ పనిముట్లు 50శాతం సబ్సీడీపై సరఫరా చేయాలని రైతులు కోరారు. స్ప్రింకర్లు మరియు డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఇప్పటి వరకూ సరఫరా చేయలేదని సంబంధిత అధికారులు స్పందించి సరఫరా చేయాలని కోరారు. కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఇవి.రమణ మాట్లాడుతూ ఈ నెల 15లోపు ఇ క్రాప్ నమోదు చేసుకున్న రైతులందరూ ఖచ్చితంగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు కార్యక్రమంలో వై.నాగూర్ యాదవ్, గజ్జల వెంకటరెడ్డి, కె.వెంకటరామయ్య, రామన తిరుపతిరెడ్డి, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

అసాంఘికాలకు అడ్డాగా పాఠశాల

బైటమంజులూరు ప్రాథమికోన్నత పాఠశాల దుస్థితి ఇది

ప్రజాశక్తి-పంగులూరు

విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేది పాఠశాల పాఠశాలలో చదువుతోపాటు క్రమశిక్షణ, నీతి, నిజాయితీ కలిగిన పౌరులుగా తయారవుతారు. అలాంటి పాఠశాలను అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా చేసుకుంటున్నారు కొందరు ఆకతాయిలు. పాఠశాలను అపరిశుభ్రం చేస్తున్నారు. పంగులూరు మండలంలోని బైటమంజులూరు మండల ప్రాథమికోన్నత పాఠశాల దీన గాథ ఇది. ఈ పాఠశాలకు వెళ్లే దారి దగ్గర నుంచి, పాఠశాల ఆవరణ వరకు మొత్తం చెత్తా చెదారం, సీసాలు, గ్లాసులతో నిండిపోయింది. పాఠశాలకు వెళ్లే దారికి దగ్గరలో ఉన్న ఇండ్లలోని వారు, చెత్త మొత్తం తీసుకొని వచ్చి, ఈదారిలోనే పారబోస్తున్నారు. పాఠశాలకు వెళ్లాలంటే దుర్గంధాన్ని భరించలేమని విద్యార్థులు వాపోతున్నారు. ఊర్లో నుంచి చెత్తను తీసుకొని



బయట మంజులూరులో పాఠశాలకు వెళ్లే రోడ్డు అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

వెళ్లటానికి రెండు రిక్షాలు ఏర్పాటు చేశారు. అయినా పారిశుధ్య కార్మికులు పాఠశాల దారిలోని చెత్తను తీసుకొని వెళ్లడం లేదు. రాత్రి సమయాల్లో స్కూలు ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. తెల్లవారేసరికి మద్యం సేవించిన గ్లాసులు, సీసాలు దర్శనమిస్తున్నాయి. దీంతో పాఠశాల ఆవరణ మొత్తం కలుషితం అవుతోంది. కొన్నిసార్లు మద్యం సీసాలు పగలగొట్టడం వలన, పిల్లలకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాల పాలవుతున్నారు. పాఠశాలలో కొత్తగా నిర్మించిన మరుగుదొడ్ల తాళాలు పగలగొట్టి మూత్ర, మల విసర్జన చేసి మందుబాబులు పాడు చేస్తున్నారు. కరెంటు బోర్డులను సైతం పగలగొట్టారు. ఈ సమస్యలపై పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చక్రవరం చిన అంజంరాజు గ్రామ పంచాయతీ, గ్రామ సచివాలయంలో విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని తెలియజేశారు. పాఠశాల ఆవరణ బాగుంటే విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులవుతారని, ఉన్నత పౌరులుగా తయారవుతారని, వారి జీవితం బాగుంటుందని, లేదంటే విద్యార్థుల జీవితాలు పాడవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండల పరిధిలోని అప్పికట్ల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఎస్ విజయలక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ గ్రామంలో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి వివరించామని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు గుంతలు ఏర్పాటు చేసుకున్న నేపథ్యంలో అవి దోమలకు అవాసాలుగా ఏర్పడుతున్నాయని చెప్పారు. ఇలాంటి నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్‌ను మురుగు గుంతల్లో వేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో సరిపడా సిబ్బంది ఉన్నారని, అన్ని మందులు, ఇతర సౌకర్యాలు, సిబ్బంది పని తీరు, కేంద్రం నిర్వహణ పట్ల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి పంచాయతీలో ఒక ఎంఎల్ హెచ్‌పి కేంద్రం ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో వైద్య సలహాలు ఇస్తున్నామన్నారు. అనీమియా లక్షణాలున్న చిన్నారులు, గర్భిణులను గుర్తించి వారి పేర్లను నమోదు చేస్తున్నామని తెలిపారు. వారికి కావాల్సిన మందులు, పౌష్టికాహారం అందించి అనీమియా లోపాన్ని సరిచేసేలా కృషి జరుగుతుందన్నారు. గ్రామీణ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు తో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు, సిబ్బంది ఆశా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శనగలో తెగుళ్లు నివారణ చర్యలు

ప్రజాశక్తి-పంగులూరు

శనగ పైరు ప్రస్తుతానికి బాగున్నట్లు కనపడుతున్నా అందులో అనేక రకాల తెగుళ్లు, చీడపీడలు, పైరును ఆశించే అవకాశాలు ఉన్నాయని, అందువలన వాటిని నివారించేందుకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని, మండల వ్యవసాయ అధికారి కే సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పంగులూరులో విలేకరులతో మాట్లాడుతూ, శనగలో ప్రస్తుతం ఎండు తెగులు ప్రధానమైందని అన్నారు. ఎండు తెగులు సోకిన మొక్కలు తొలిదశలో త్వరగా చనిపోతాయని చెప్పారు. కొంచెం పెరిగిన మొక్కలలో ఆకులు వడలిపోయి, ఆలస్యంగా చనిపోతాయన్నారు. ఈ ఎండు తెగులు నివారణకు ఐసీసీ సి-37, ఐసీసీవి-2, ఐసీసీవి-10, రకాలను వరుసగా మూడు, నాలుగు సంవత్సరాలు ఒకే పొలంలో ఎత్తుకోకూడదని, పంట మార్పిడి, విత్తన శుద్ధి జరగాలని అన్నారు. ఎండు తెగులుతో పాటు వేరు కుళ్ళు తెగులు, మొదలు కుళ్ళు తెగులు, వంటివి ఆశించే అవకాశం ఉందని, వీటి నివారణకు 2.5 గ్రాముల కార్బన్డిజం, లేదా విటావాక్స్ పవర్ 1.5 గ్రాములు, లేదా 1.5 టెబు కోనజోల్ కిలో విత్తనానికి కలిపి విత్తుకోవాలన్నారు. తరువాత విత్తనానికి ట్రైకో డర్మావిరిడి పొడి మందును, 8 గ్రాముల నుంచి



ఏపుగా పెరిగిన శనగ పైరు

10 గ్రాములు కలిపి విత్తుకోవటం వలన, ఈ శిలీంధ్రం భూమిలో బాగా వ్యాప్తి చెంది, తెగుళ్ళ బారి నుంచి పంటను రక్షిస్తుందని సుబ్బారెడ్డి తెలిపారు. శనగపచ్చ పురుగు కూడా శనగ పంటను బాగా ఇబ్బంది పెడుతుందన్నారు. ఇది లద్దె పురుగు దశలో పూతను, కాయలను తింటూ ఉంటుందని, సీతాకోకచిలుక దశలో పూత పైన, కాయలపైన గుడ్లను ఒక్కొక్కటిగా పెడుతుందని సుబ్బారెడ్డి చెప్పారు. గుడ్ల నుంచి వచ్చిన పురుగు, కాయలను తొలిచి గింజలను తింటుందని తెలిపారు. దీని నివారణకు లీటర్ నీటికి ఎండో సల్ఫాన్ 2.0 మిల్లీ లీటర్లు, లేదా క్వినాల్ పాస్ 2.0 మిల్లీలీటర్లు, లేదా ఎసిఫేట్ 1.0 గ్రాములు చొప్పున పూత, పిందె దశల్లో 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి రెండు మూడు సార్లు పిచికారీ చేయాలని సుబ్బారెడ్డి సూచించారు.

27మంది సీఈసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-చీరాల

సూర్య టెక్ సొల్యూషన్స్, హైదరాబాదు ఆధ్వర్యంలో చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 27మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు సతీష్, ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక ప్రక్రియలో మొదట రాత పరీక్ష జరిపి అందులో అర్హత సాధించిన వారికి సాంకేతికతపై పరీక్ష నిర్వహించి ఇంటర్వ్యూలు చేశారు. చివరగా 27 మందిని ఎంపిక చేశారు. ప్రాంగణ ఎంపికలకు బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఇసి, ట్రిపుల్ ఈ మెకానిక్ విద్యార్థులు 60 మందికి పైగా హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థులకు నియామకపు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో ఒకేసారి 27 మంది విద్యార్థులు ఎంపిక అవ్వటం హర్షణీయమన్నారు. ఎంపికైన విద్యార్థులు మరింతగా కష్టపడి మంచి ఫలితాలు సాధించింది పదోన్నతిని పొందాలని ఆకాంక్షించారు. కళాశాలలో మొదటి సంవత్సరం నుంచి దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. ఉద్యోగాలు సాధించడానికి అవసరమైన అంశాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ వలన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలను సులువుగా దక్కించుకుంటున్నారని చెప్పారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ బాజీ షాహిద్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు రూ.3 లక్షల ప్యాకేజ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని యాజమాన్యం తోపాటు ఆచార్యులు, సహాయచార్యులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడిలు డాక్టర్ షేక్ బషీరా, డాక్టర్ టి శ్రీనివాసరావు, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

ఘనంగా సజ్జా కుమార్తె వివాహం

వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే కరణం, ఇన్‌ఛార్జి వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల: ప్రముఖ వ్యాపారవేత్త సజ్జా వెంకటేశ్వర్లు కుమార్తె జాహ్నవి యశ్వంత్ కుమార్ దంపతుల వివాహ మహోత్సవం శుక్రవారం ఆమోదగిరి పట్టణం కేపాలు కాలనీ సమీపంలో ఉన్న సాయిబాబా కళ్యాణమండపంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుక మహోత్సవానికి చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆయన తనయుడు నియోజవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు పలువురు ప్రముఖులు హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు. సజ్జా వెంకటేశ్వర్లు చీరాల ప్రాంత వాసులకు సుపరిచితులు కావడంతో వివాహ వేడుకలకు ఆత్మీయులు, ప్రముఖులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

తమ కాలనీ వాసులకు పంచాయతీ వారి తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులకు గురవుతున్నామని చెరుకుపల్లి చెన్నకేశవ నగర్ కాలనీ వాసులు శుక్రవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. చెరుకుపల్లి గ్రామ పంచాయతీలోని భూమిలేని పేదలకు గతంలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేయగా సుమారు 160 కుటుంబాల వారు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. కాలనీలో భూగర్భ జలం సక్రమంగా లేకపోవడంతో ప్రజలందరూ పంచాయతీ కుళాయిలు ద్వారా వచ్చే నీటిని తాగు, కుటుంబ అవసరాలకు వాడుకుంటున్నారు. అయితే గత కొన్ని రోజులుగా నీరు సక్రమంగా అందడం లేదని, తద్వారా ఇబ్బందులకు గురవుతూ ఉన్నామని కాలనీ మహిళలు శుక్రవారం డిప్యూటీ తహశీల్దారు టీ నిరంజన్ బాబుకు వినతిపత్రం అందజేశారు. దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోలేక, పంచాయతీ వారు సరఫరా చేసే నీరు సక్రమంగా ఉపయోగపడక అవస్థలు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మార్చి కల్లా సచివాలయ భవన నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం అప్పికట్ల గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన సచివాలయ భవనం నిర్మాణ పనులు మార్చి కల్లా పూర్తి చేసేలా పని జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఇంకా ఫ్లోరింగ్, విద్యుత్, పెయింటింగ్, ప్లమ్మింగ్, కిటికీలు, తలుపులు పనులు చేయాల్సి ఉందన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి సచివాలయ భవనాన్ని అందుబాటులో తెస్తామని పేర్కొన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం అవసరమని తెలిపారు. చెత్త చెదారం వ్యర్థ పదార్థాలు నిర్దేశించిన ప్రాంతంలోనే పడేయాలని కోరారు. దీని వల్ల పారిశుధ్య పనులు సులువుగా చేసుకునే అవకాశం ఉందన్నారు.

నేడు కొల్లూరుకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-భట్టిప్రోలు(కొల్లూరు)

ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా కొల్లూరులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ బి. సుధాకర్ తెలిపారు. కొల్లూరు గ్రామ ప్రజలు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.



బ్రిడ్జి పునరుద్ధరణ పనులు చేస్తున్న అధికారులు

బ్రిడ్జి నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం

ప్రజాశక్తి-చీరాల

చీరాల స్వర్ణ ప్రధాన రహదారిలో చప్టా వద్ద గత కొంతకాలంగా మార్గం మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడి వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించిన అధికారులు ఎట్టకేలకు సుమారు రూ.11 లక్షలతో బ్రిడ్జి పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. అయితే గత సంవత్సర కాలంగా వాహనాలు రాకపోకల ఇబ్బందుల గూర్చి 'ప్రజాశక్తి'లో ఆ దారిలో ప్రయాణం ప్రమాదకరం అంటూ కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా బ్రిడ్జి పునరుద్ధరణ కోసం రూ.11 లక్షలతో పనులు ప్రారంభిస్తున్నట్లు కాంట్రాక్టర్ ధనుంజయరాజు, రహదారులు భవనాల శాఖ డిఈ నరసింహులు తెలిపారు. దీనికోసం శుక్రవారం నుంచి ఆ రహదారిని మూసివేసి పక్కనే డైవర్షన్ రోడ్డు కూడా వేసినట్లు వారు తెలిపారు.

తిరుణాళ్లను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని అరవపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి మహాశివరాత్రి తిరునాళ్ల ఫిబ్రవరి 17,18,19 తేదీలలో జరిగే తిరుణాలను జయప్రదం చేయాలని రేపల్లె మండల తహశీల్దారు డి మల్లికార్జునరావు అన్నారు. శుక్రవారం మండల అరవపల్లి బాల కోటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశ నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దారు డి మల్లికార్జునరావు మాట్లాడుతూ తిరునాళ్ల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్య లేకుండా దేవాలయాల వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రోజులపాటు గ్రామంలో మద్యం విక్రయాన్ని నిషేధించాలని, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ భూపతి హరిప్రసాద్ జిల్లా ఆర్టీఏ అధికారి ప్రసన్నకుమారి, ఆర్ఐ విజేందర్ రావు, రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, దేవస్థానం ఈవో రాజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ కుమార్, పట్టణ ఎస్ఐ అబ్దుల్ రజాక్, భరత్, ఆర్టీసీ డిఎం జాన్ సుందరం, ఎంపీడీవో మల్లికార్జునరావు, గ్రామ సర్పంచ్ లోయ బాబు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

'యువగళం' పాదయాత్రలో 'ఉగ్ర'

ప్రజాశక్తి-పామూరు


పాదయాత్రలో పాల్గొన్న ఉగ్ర

నెల్లూరు జిల్లా గంగధార ప్రాంతంలో యువగళం పాదయాత్రలో రాష్ట్ర టిడిపి యువ నేత నారా లోకేష్‌బాబు పాదయాత్ర జరుగుతున్న సందర్భంగా టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ జడ్‌పిటిసి సభ్యులు బొల్లా మాల్యాద్రి చౌదరి, దారపనేని సుబ్బారావు, ఎస్‌డి అమీర్‌బాబు, ఇరి కోటిరెడ్డి, ఎం రమణయ్య, ఆర్ నారాయణ ఉన్నారు.

చంద్రబాబును కలిసిన డేవిడ్‌రాజు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం


చంద్రబాబుతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు

యర్రగొండపాలెం మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో టిడిపి జాతీయ కార్యదర్శి నారా చంద్రబాబునాయుడును కలిశారు. ఈ సంధర్భంగా చంద్రబాబు నాయుడు డేవిడ్‌రాజుతో పాటు ఆయన కుమారుడు విజేష్‌రాజ్, కోడలు మనీషాలతో మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి సంబంధించిన బయోడేటాలను తీసుకున్నారు. పార్టీ కోసం మీ సేవలు అవసరమని చెప్పారు. కాగా వీరు యర్రగొండపాలెం నుంచి టిడిపి టిక్కెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎరిక్షన్‌బాబు ఇంచార్జిగా కొనసాగుతుండగా.. మరికొందరు మాత్రం డేవిడ్ రాజు అయితేనే తాము పార్టీ కోసం పని చేస్తామని బహిరంగంగా చెబుతున్నారు.

యుటిఎఫ్ నగర కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

యుటిఎఫ్ ఒంగోలు అధ్యక్ష, కార్యదర్శులుగా సిహెచ్.లక్ష్మినారాయణ, ఎం.బాలరాజు ఎన్నికయ్యారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నగర శాఖ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా చినస్వామి, పరిశీలకులుగా డి.వీరాంజనేయులు వ్యవహరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓవి.వీరారెడ్డి, ఎస్.రవి ముఖ్య అతిథులుగా పాల్గొని కొత్త కార్యవర్గాన్ని అభినందించారు. యుటిఎఫ్ ఒంగోలు నగర శాఖ గౌరవాధ్యక్షులుగా సిహెచ్ వెంకట రమణయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్ లక్ష్మినారాయణ, ఎం.బాలరాజు, సహాధ్య క్షులుగా డిజయధే. నాగమణి, కోశాధికారిగా ఎస్.భాస్కర్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఎన్. శింగయ్య, బి.సుబ్బారెడ్డి, ఎన్.ఏడుకొండలు, రసూల్, గీతా, పర్వీన్, పి.వెంకటేశ్వర్లు ఎన్నిక య్యారు. జిల్లా కౌన్సిలర్లుగా కెవి ప్రసాద్, ఎస్.రామకృష్ణయ్య, డి.జ్యోత్స్నాదేవి ఎన్నికయ్యారు.

రైతు భరోసా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-పెద్దారవీడు

స్థానిక మండల వ్యవసాయ అధికారి బుజ్జిబాయి మండలంలోని పుచ్చకాయలపల్లి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు. రైతులతో కాసేపు ముచ్చటించారు. అందులో భాగంగా పెద్దారవీడు మండలంలో పురుగుమందులను అధిక ధర విక్రయిస్తున్నట్టు రైతులు మండల వ్యవసాయ అధికారి దష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన వ్యవసాయ అధికారి డీలర్లతో మాట్లాడి ఎవరైనా అధిక ధర విక్రయిస్తున్నట్టు తెలిసినట్లయితే లైసెన్స్ రద్దు చేసి షాప్ క్లోజ్ చేయిస్తామని హెచ్చరించారు. నెలలో రెండో శుక్రవారం అయిన సందర్భంగా మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి బోర్డు మెంబర్లకు, మరియు రైతులకు సమావేశంలో పిఎం కిసాన్ గురించి విలువైన విషయాలు తెలియజేశారు. సమావేశంలో పెద్దారవీడు మండల వ్యవసాయ అధికారి కె.బుజ్జిబాయి, బోర్డు మెంబర్స్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను ఉపాధి ఏపీవో కందుకూరు నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. మస్టర్‌లను తనిఖీ చేశారు. పనులకు వచ్చిన వారికి మాత్రమే హాజరువేయాలని సూచించారు. పనుల విషయంలో కూలీలకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. పలు కల్పించడంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట టెక్నీకల్, ఫీల్డ్ సిబ్బంది ఉన్నారు.

నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో లబ్ధిదారులు మంజూరైన గృహాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ ఎం.రంగసుబ్బరాయుడు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జగనన్న కాలనీలలో హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రంగసుబ్బరాయుడు, హౌసింగ్ ఏఈ అంజిరెడ్డి, ఐకెపి ఏపిఎం మూల వెంకిరెడ్డి, ఎంఈవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వ పథకాలు ప్రతి పేద కుటుంబానికీ అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దూబ గుంట్ల పంచాయితీ పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం దూబగుంట్ల మాజీ సర్పంచ్ మితికాల గురుస్వామికి పార్టీ కండువా కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి చప్పిడి సుబ్బయ్య, హుస్సేన్‌రెడ్డి, కందుల శ్రీనివాసరెడ్డి, పువ్వాడి రాంబాబు పాల్గొన్నారు.

'బెతూన్'లో ఆధునిక వైద్య సేవలు

- మూడో తరం వైద్యుల నుంచి మంచి సేవలు
- పేదలకు కొంతకాలం ఉచితంగా వైద్యపరీక్షలు
- డాక్టర్ పురుషోత్తమరావు, ఉదయిని వెల్లడి



మాట్లాడుతున్న డాక్టర్ పురుషోత్తమరావు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

బెతూన్ నర్సింగ్ హోంలో మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రకాల వైద్యసౌకర్యాలను మెరుగుపరచడం జరిగిందని, తక్కువ ఖర్చుతోనే ఆధునిక వైద్యం అందిస్తున్నామని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ టి.పురుషోత్తమరావు, డాక్టర్ ఉదయిని చెప్పారు. 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఒక ఉన్నత లక్ష్యంతోనే వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పుడు మూడో తరం వైద్యులుగా తమ కుమార్తె డాక్టర్ స్వాతీ, అల్లుడు డాక్టర్ సందీప్ కూడా వారి విభాగాల్లో ఆధునిక వైద్యసేవలు తక్కువ ఖర్చుతోనే చేస్తారన్నారు. శుక్రవారం నాడు ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వీరు కూడా ఆసుపత్రి ఆశయాలను కొనసాగిస్తారన్నారు. ఇటీవలే ఆసుపత్రిని ఆధునీకరించామన్నారు. ఆధునిక వైద్యపరికరాలను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. అధునాతన ఆపరేషన్ థియేటర్లు, ల్యాబ్‌లు, లాపరోస్కోపిక్ యంత్రాలు, ఇతర విభాగాల్లో పరికరాలను కొత్తవి ఏర్పాటు చేశామన్నారు. వీటిని ఉపయోగించి కూడా తక్కువ ఖర్చుతోనే వైద్యసేవలు అందించడం కూడా ఇప్పుడున్న పరిస్థితుల్లో సవాలుగానే తీసుకుంటున్నామన్నారు. మూడో తరం వైద్యులు వారి విభాగాల్లో సేవాదృక్పథంతో వైద్యం ప్రారంభించారన్నారు. కొంతకాలం పాటు పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. ఓపీతో పాటు ఉచితంగా ఎక్స్‌రే, ఇతర పరీక్షలు కూడా ఉచితంగానే చేయాలని నిర్ణయించామన్నారు. డాక్టర్ సందీప్ ప్రకాష్ మాట్లాడుతూ ఆర్థో విభాగంలో అన్ని రకాల చికిత్సలు చేస్తామన్నారు. మోకాళ్ల ఆపరేషన్లు, ఇతర ఆర్థో సంబంధిత ఆపరేషన్లను బయట ఆసుపత్రుల్లో ధరల కంటే 30 శాతం తక్కువకే కొంతకాలం పాటు చేస్తామన్నారు. పేదలకు అన్ని వేళలా వీలైనంత తక్కువ ఖర్చుతోనే వైద్యం అందిస్తామని, ఆసుపత్రి ఆశయాలను కొనసాగిస్తామన్నారు. ఆధునిక పరికరాలతో ఆపరేషన్లు సులభతరంగా ఉంటాయన్నారు. లాపరోస్కోపిక్‌తో ఆపరేషన్లను పెంచడం వల్ల కుట్లుతో పని లేకుండా పోతుందన్నారు. డాక్టర్ స్వాతి మాట్లాడుతూ సంతాన సాఫల్య విభాగంలో ఆధునిక పద్దతులతో పిల్లలు లేని వారికి పిల్లలు పుట్టించే ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఇందులో పారదర్శకంగా అన్ని చెప్పే చేస్తామన్నారు. చాలా క్లిష్టమైన పరిస్థితులను కూడా అధిగమించి పిల్లలు పుట్టేలా వైద్యసేవలు ఉంటాయన్నారు. పేదలకు కొంతకాలం పాటు ఓపి లేకుండా వైద్యం చేయడంతో పాటు కొన్ని పరీక్షలు కూడా ఉచితంగానే చేస్తామన్నారు. జిల్లా ప్రజానీకం ఈ సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు.

గాలి మాటలు పట్టించుకోం..

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రతిపక్షాలు ఏదో ఒక చోట నలుగురు కూర్చొని గడపగడపకూ మన ప్రభుత్వం కార్య క్రమంపై విమర్శలు చేయడం సరికాదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. అలాంటి గాలి మాటలను, ఆ నేతలను తాము పట్టించు కోమని, ప్రజలకు జవాబుదారీగా ఉంటామని మంత్రి స్పష్టం చేశారు. పెద్ద దోర్నాల మండల పరిధిలోని చిన్న గుడిపాడు గ్రామంలో శు క్రవారం మంత్రి సురేష్ 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. నాయ కులతో కలిసి గ్రామంలో విస్తతంగా పర్యటిం చారు. సర్పంచ్ వల్లభనేని పవన్ కుమార్ ఆధ్వ ర్యంలో ప్రజలు మంత్రిపైన పూలవర్షం కురిపించారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ

మంత్రి ఆదిమూలపు సురేష్


ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అంద జేస్తున్న ఘనత సీఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కు తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, సర్పంచ్ వల్లభనేని పవన్‌కుమార్, మాజీ జోగి వెంకట నారాయణ, నాయకులు గుమ్మా యల్లేష్, వెన్నా కాశిరెడ్డి, యోగిరెడ్డి, ఖాశింపీరా, నాగేశ్వరరావు, వెన్నా వెంకటరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

15 నుంచి గ్రానైట్ స్టోనా

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు బెంగుళూరులో అంతర్జాతీయ గ్రానైట్ స్టోనా ఎగ్జిబిషన్ జరగనుంది. నాలుగేళ్ల తరువాత జరుగుతున్న స్టోనా ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అంతర్జాతీయంగా గ్రానైట్ పరిశ్రమ సంక్షోభం ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్టోనా అనంతరమైనా ప్రోత్సాహం అందుతుం దని క్వారీల యజమానులు ఆశతో ఉన్నారు. వివిధ రకాల గ్రానైట్ నమూనాలతో పాటు మాన్యుమెంట్స్, ఆధునిక పరికరాలు ప్రదర్శనకు వచ్చే అవకాశముంది. దీంతో ప్రకాశం జిల్లాలో చీమకుర్తి ప్రాంతంలో లభించే గెలాక్సీ గ్రానైట్, బల్లికురవ, గురిజేపల్లి ప్రాంతాలలో లభించే స్టీల్‌గ్రే గ్రానైట్ రకాలు ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనలో పెట్టడానికి యజమానులు సిద్ధమవుతున్నారు. బెంగుళూరులోని స్టోనాకు వెళ్లేందుకు సమాయత్తమవుతున్నారు.

'కిమ్స్'లో గుండెకు అధునాతన శస్త్రచికిత్స

- 'గుండె విద్యుత్ ప్రసరణ వ్యవస్థ'లో ప్రేరక యంత్రం ద్వారా ఆపరేషన్ విజయవంతం
- నాలుగు జిల్లాల్లో ఇక్కడే ప్రథమం



వివరాలు వెల్లడిస్తున్న కిమ్స్ వైద్యులు, సిబ్బ

ప్రజాశక్తి-ఒంగోలు

గుండెకు విద్యుత్ ప్రసరణ వ్యవస్థలో లోపం ఉన్న వ్యక్తికి ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలలో అధునాతన శస్త్రచికిత్స చేశారు. ఇలాంటి శస్త్రచికిత్స నిర్వహించడం నాలుగు జిల్లాల్లో ఇక్కడే ప్రప్రథమం. శాశ్వత కృత్రిమ హృదయ గతి ప్రేరక యంత్రం ద్వారా ఈ చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. శు క్రవారం ఒంగోలులోని కిమ్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.శ్రీహరిరెడ్డి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కె.అంకిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రావినూతల గ్రామానికి చెందిన అన్నంగి ఆంజనేయులు (62) నడుస్తుంటే అలసట మరియు కళ్లు తిరగడం వంటి లక్షణాలతో బాధపడుతూ.. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌కు వచ్చారు. ఆయనను పరీక్షించిన వైద్యులు గుండె స్పందన నిమిషానికి 40 సార్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యాధిని గుండె విద్యుత్ ప్రసరణ వ్యవస్థలో లోపంగా తేల్చారు. ఇటువంటి వారికి శాశ్వత కత్రిమ హదయ గతి ప్రేరక యంత్రాన్ని (ఫేస్ మేకర్) అమర్చాలి. సాధారణంగా గుండె కుడి జఠరిక శికర భాగంలో (రైట్ వెంట్రికల్) అమర్చడం జరుగుతుంది. దీని వల్ల 15 శాతం మంది రోగులలో భవిష్యత్తులో సాధారణంగా ఉన్నటువంటి పంపింగ్ పనితనం తగ్గవచ్చు. అధునాతన గుండె విద్యుత్ ప్రేరక చికిత్స ద్వారా పైన చెప్పిన విధంగా గుండె పనితనం తగ్గే ప్రమాదం ఉండదు. ఒంగోలులో ప్రపథమంగా ఇలాంటి శస్త్రచికిత్స కిమ్స్ హాస్పిటల్‌లో చేశారు. ఈ చికిత్స చేయడంలో నైపుణ్యం ఉన్నటువంటి డాక్టర్ ఆనంద్ యాదవ్ ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇటువంటి చికిత్సను ఒంగోలు, నెల్లూరు, కడప మరియు అనంతపురం జిల్లాల్లోనే ప్రప్రథమంగా గుండె విద్యుత్ ప్రసరణ వ్యవస్థలో ప్రేరక యంత్రం అమర్చడం జరిగింది. ఒంగోలులోని కిమ్స్‌లో గుండె విద్యుత్ ప్రసరణ వ్యవస్థ సంబంధిత రోగాలన్నింటికీ చికిత్సలు అయినటువంటి ఎలక్ట్రోఫిజియాలజీ స్టడీస్ మరియు రేడియో ఫ్రీక్వెన్సీ అబలేషన్ కూడా చేస్తామని చెప్పారు. అన్ని గుండె సమస్యలకు సంపూర్ణమైన వైద్య సేవలు అన్ని వేళలా కిమ్స్ హాస్పిటల్లో అందిస్తున్నామన్నారు.